నల్లచెరువు బాధితుల గోడు వర్ణనాతీతం..

- కూల్చివేతలతో పేదోడి బతుకు ఆగమాగం
- వర్షంలో తడుస్తూ.. సామాను తీసుకుపోతూ..
- శిథిలాల మధ్య నుంచి ఆటోలు, ట్రాలీలలో ఇతర ప్రాంతాలకు ..

సిటీబ్యూరో,సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : కూకట్‌పల్లి నల్లచెరువు బాధితుల గోడు వర్ణనాతీతం. హైడ్రా కూల్చివేతల్లో బతుకుదెరువు కోల్పోయి రోడ్డున పడ్డ సామాన్యుడి జీవనచిత్రమిది. రెక్కాడితేకానీ డొక్కాడని బడుగుజీవుల జీవితాలపై హైడ్రాబుల్డోజర్ పంపి వారి బతుకును ఛిద్రం చేసింది. ఆదివారం నల్లచెరువులో జరిగిన కూల్చివేతల తర్వాత మంగళవారం రోజు 'నమస్తే తెలంగాణ'కు కనిపించిన దృశ్యాలివి. ఒక వైపు జోరుగా వర్షం కురుస్తున్నా లెక్కచేయక శిథిలాల మధ్య తమ సామగ్రిని వెతుక్కుంటూ బతుకుజీవుడా అంటూ తరలించుకుపోతున్నారు బాధితులు. హైడ్రా కూల్చివేతల్లో అడుగడుగునా తమ బతుకులు ఆగమైతాయని కాళ్లావేళ్లా పడ్డా బాధితులను కనికరించని అధికార కర్కశత్వపు తాలూక ఆనవాళ్లు ఇప్పటికీ సజీవంగా కనిపిస్తూనే ఉన్నాయి. రెండురోజుల క్రితం కూల్చివేతల్లో రేకుల షెడ్లు నేలమట్టం కాగా.. వాటిలో మిగిలిన సామానును, రేకులను మోసుకుంటూ ట్రాలీలు, లారీల్లో మరోచోటకు తరలించుకువెళ్లే క్రమంలో వానలో, బురదలో వారి సామాను చిందరవందరగా పడేసిన తీరును చూసి ప్రతి ఒక్కరూ గుండె పగిలేలా రోధిస్తున్నారు. తమ బతుకులు ఎలా బాగుపడాలా అని ఆవేదన చెందుతూ సర్కార్ తీరును నిరసిస్తూ శాపనార్థాలు పెడుతున్నారు. టెంట్‌హౌజ్ సామగ్రి కూల్చివేతల్లో దెబ్బతినగా.. మిగిలిన కొంతను తమతో తీసుకెళ్తున్నారు . అసలు నల్లచెరువు కూల్చివేతల దృశ్యాలు చూస్తే భూకంపం వచ్చిన తర్వాత ఆ ప్రాంతమంతా ఎలా ఉంటుందో అలాంటి పరిస్థితే ఇక్కడ కూడా సాక్ష్యంగా కనిపిస్తోంది.

నేలమట్టమైన గుడిసెలు, షెడ్లు

కూకట్‌పల్లి నల్లచెరువు ప్రాంతంలో కూల్చివేతల తర్వాత..

కూల్చివేతల అనంతరం డీసీఎంలో సామగ్రిని తీసుకెళ్తున్న బాధితులు

ఐఐసీటీలో ఉద్యోగ అవకాశాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) : పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రిన్సిపల్ ప్రాజెక్టు అసోసియేట్, ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్టు అసోసియేట్-II వంటి ఉద్యోగాలకు ఎమ్మెస్సీ, ఎంటెక్(కెమికల్), బీఎస్‌సీ, బీటెక్ కెమికల్, బీటెక్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, బీటెక్ మెకానికల్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు జరిగే వాక్‌ఇన్‌లో పూర్తి దరఖాస్తులతో వచ్చి పాల్గొనవచ్చని, వివరాలకు ఐఐసీటీ కెరీర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉపాధి శిక్షణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అల్పసంఖ్యాక వర్గానికి చెందిన విద్యావంతులు, నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉపాధి శిక్షణ, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాజ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు, బౌద్ధులు, పార్సీలు, సిక్కులు, జైనులకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐటీ రంగంలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ అందిస్తామని చెప్పారు. కోర్సుల వ్యవధి 3-6 నెలలు ఉంటుందని వెల్లడించారు. డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, వెబ్‌డిజైన్ గ్రాఫిక్ డిజైన్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3డీ యానిమేషన్, వీఎఫ్‌ఎక్స్, యాప్ డెవలప్‌మెంట్, తదితర వాటిలో శిక్షణ ఇస్తామని అన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్: 040-23244501ను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రీడాకారుల ప్రోత్సాహానికి దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి హైదరాబాద్ జిల్లా క్రీడాభివృద్ధి శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారి సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభకు సంబంధించిన వివరాలను, సర్టిఫికెట్లను, ఆధార్ కార్డు, 2 పాస్‌ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు జింఖానా గ్రౌండ్స్ క్రీడా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్: 9293312848లో సంప్రదించాలని కోరారు.

ఏఎంఎస్‌ను కొనసాగించండి

జలమండలి ఎండీకి కాంట్రాక్టర్ల వినతి

సిటీబ్యూరో, సెప్టెంబరు 24 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం (ఏఎంఎస్)ను కొనసాగించాలని ఏఎంఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇనామ్ ఉల్ హక్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. తాము ఏఎంఎస్ కింద అన్ని డివిజన్లలో ఎమర్జెన్సీ పనులు, ఎంసీసీ ఫిర్యాదుల్లో వచ్చే పొల్యూషన్, లీకేజీలు, డ్యామేజ్ అయిన సీవరేజీ మ్యాన్‌హోళ్లు , పైపులైన్ల మరమ్మతులు, సివిల్ వర్క్‌లు, సమ్మర్ యాక్షన్‌ప్లాన్, మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ వరకు అన్ని పనులు నిర్వహిస్తున్నామని కాంట్రాక్టర్లు వివరించారు. గతంలో ఎస్ఎస్ఆర్ పద్ధతి అమల్లో ఉన్నప్పుడు చాలా తక్కువ మొత్తంలో పని కేటాయించేవారని, అంతే స్థాయిలో పనులు జరిగేవని చెప్పారు. కానీ తర్వాత వచ్చిన ఏఎంఎస్‌తో తక్కువ కాలంలో అన్ని రకాల పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏఎంఎస్ వ్యవస్థను భవిష్యత్‌లోనూ ఇలాగే కొనసాగించాలని, అందుకు తమ అసోసియేషన్ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని కాంట్రాక్టర్లు ఎండీకి చెప్పారు.

హోంగార్డులను పర్మినెంట్ చేయాలి..

మంత్రులకు హోంగార్డు ప్రతినిధుల వినతి

హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంత్రులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న హోంగార్డు ప్రతినిధులు

కాచిగూడ, సెప్టెంబర్ 24: తెలంగాణ రాష్ట్రంలో తక్కువ జీతాలతో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న హోంగార్డులను పర్మినెంట్ చేయాలని హోంగార్డు ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ హోంగార్డ్స్ గౌరవ అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హోంగార్డు ప్రతినిధులు .. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. హోంగార్డుల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని వారు మంత్రులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో పిల్లల ఫీజులు కట్టలేక, కుటుంబాలను పోషించలేక ఇబ్బందులకు గురవుతున్నామని, ఇప్పటికైనా తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ డాక్టర్ దయానంద్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఉపాధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, హరిబాబు, జాయింట్ సెక్రటరీ ఎస్.నారాయణరెడ్డి, మోహన్‌నాయక్, ప్రసాద్, వీరేందర్, లక్ష్మీనారాయణ, శివనారాయణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల జోలికొస్తే...అడ్డుకుంటాం

గోల్నాక మూసీ పరీవాహకప్రాంత బాధితుల ధర్నా..

పేదలకు అండగా ఉంటాం : కార్పొరేటర్ లావణ్యాగౌడ్

గోల్నాక లంకలో మూసీ పరీవాహకప్రాంత బాధితుల ధర్నాలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య

గోల్నాక, సెప్టెంబర్ 24: పేదల ఇండ్ల జోలికివస్తే ఊరుకునేది లేదని, ప్రాణాలు అడ్డువేసైనా హైడ్రా బుల్డోజర్లను అడ్డుకుంటామని అంబర్‌పేట నియోజకవర్గం, గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యా శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం గోల్నాక డివిజన్, తులసీరాంనగర్ లంకలో డివిజన్‌లోని కృష్ణానగర్, తులసీరాం నగర్, కమలానగర్, అన్నపూర్ణ నగర్, అంబేద్కర్ నగర్, తదితర మూసీ పరీవాహక ప్రాంతాలకు చెందిన బాధితులతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో ఆమె మాట్లాడుతూ.. మూసీ పరీవాహకప్రాంత ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గత 30 ఏండ్లుగా పేదలు కష్టపడి చిన్న స్థలాలు కొనుక్కొని ఇండ్లు నిర్మించుకుంటే..ఇప్పుడు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా పేరుతో కూల్చడానికి వస్తే అడ్డుకుంటామన్నారు. పేదల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వం వారి పొట్టకొట్టాలని చూస్తున్నదని ఆరోపించారు. పేదల ఇండ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు.

ప్రైవేట్ హాస్టళ్లపై జీహెచ్‌ఎంసీ నజర్..!

హెల్త్, శానిటేషన్, ఫైర్ విభాగాలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు వచ్చేవారం నుంచి రంగంలోకి..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ హాస్టళ్లపై జీహెచ్‌ఎంసీ ఎట్టకేలకు దృష్టి సారించింది. ఇటీవల కాలంలో నగరంలోని పలు హాస్టళ్లపై ఫిర్యాదులు అధిక సంఖ్యలో వస్తుండడం, నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నట్లు సోషల్ మీడియాలో పోరులు పోస్టులు పెడుతున్న తరుణంలో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. హాస్టళ్లలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ హెల్త్, శానిటేషన్, ఫైర్ విభాగాల అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ వేశారు. ఇందుకు కమిషనర్ ఆమ్రపాలి ఆమోదం తెలిపారు. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించేలా ఈ కమిటీ చర్యలు చేపట్టనున్నది. ముఖ్యంగా ప్రైవేట్ హాస్టళ్లలో వందలాదిమంది విద్యార్థులు ఉంటుండగా..టాయిలెట్లు నామమాత్రంగానే ఉండడం, ఆపరిశుభ్రమైన వాతావరణంపై ప్రత్యేక దృష్టి సారించేలా టాస్క్‌ఫోర్స్ పనిచేయనున్నది. ఈ మేరకు 30 సర్కిళ్ల పరిధిలో ఉన్న ప్రైవేట్ హాస్టళ్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. వచ్చే వారంలో టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగి నిబంధనలు ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోనున్నది.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేత

మచ్చబొల్లారం డివిజన్, ఏడు కాలనీల డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేసి వివరిస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, సెప్టెంబర్ 24: మల్కాజిగిరి నియోజకవర్గం, మచ్చబొల్లారం డివిజన్‌లోని ఏడు కాలనీల డ్రైనేజీ సమస్యను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం మచ్చబొల్లారం డివిజన్, ఏడు కాలనీల డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే.. గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ కాలనీల్లో సరియైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకుండానే గ్రేటర్ టౌన్ ప్లానింగ్ అధికారులు బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని అన్నారు. బహుళ అంతస్తులు నిర్మించిన తర్వాత డ్రైనేజీని బయటకు వదులుతున్నారని అన్నారు. తుర్కపల్లి ప్రాంతంలోని మడుకట్ల బస్తీ, శ్రీదామ్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలను హకీంపేట ఎయిర్‌ఫోర్స్ లోపలి నుంచి వరదనీరు ముంచెత్తుతున్నదని అన్నారు. ఇప్పటికే దీనిపై ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వర్మతో చర్చించామని, వారు సానుకూలంగా స్పందించి.. పైప్‌లైన్ ద్వారా వరదనీరు ప్రవహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఎయిర్‌ఫోర్స్‌వారు నిర్మించే పైపులైన్‌కు అనుసంధానంగా ప్రభుత్వం మరో పైపులైన్ నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, పరశురాంరెడ్డి, కరంచంద్, జీకే హన్మంతరావు, రమేశ్, ఉపేందర్‌రెడ్డి, రాము యాదవ్, అనిల్‌కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

28న రాష్ట్రపతి రాక.. పకడ్బందీగా ఏర్పాట్లు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఈ నెల 28న నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన.. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏర్పాట్లపై సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో జిల్లాలోని హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని.. అక్కడ అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి విభాగానికి ఒక అధికారిని నియమిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లు, పారా గ్లైడర్స్‌పై నిషేధాజ్ఞలు : సైబరాబాద్ సీపీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఈ నెల 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరానికి వస్తున్న సందర్భంగా సైబరాబాద్ పరిధిలోని శామీర్‌పేట్, అల్వాల్ , మేడ్చల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. నల్సార్ యూనివర్సిటీలో 21వ స్నాతకోత్సవానికి, రాష్ట్రపతి భవన్‌లో భారతీయ కళా మహోత్సవ – 2024 కార్యక్రమాలకు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు.

సీవరేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి
- డివిజన్-6లోని పలు ప్రాంతాల్లో పర్యటన..

సిటీబ్యూరో, సెప్టెంబరు 24 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న సీవరేజీ సమస్యల నివారణపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు సంస్థ ఎండీ అశోక్‌రెడ్డి గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డివిజన్-6లోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. మొదట కృష్ణానగర్ సీ బ్లాక్ ప్రాంతంలో సీవరేజీ నెట్‌వర్క్ పైపులైన్‌ను పరిశీలించారు.. ఇది 30 ఏండ్ల క్రితం నిర్మించింది కావడంతోపాటు జీహెచ్‌ఎంసీ నాలాకు అనుసంధానమై ఉంది.. దీంతో ఎల్లారెడ్డి సెక్షన్ పరిధిలో తరచూ సీవరేజీ ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన గుర్తించారు. అనంతరం అమీర్‌పేట మెయిన్‌రోడ్, శ్రీనగర్ కాలనీ ఆటో స్టాండ్ జంక్షన్ ప్రాంతంలోని మురుగునీటి సమస్యను పరిశీలించారు. సీవరేజీ ఓవర్ ఫ్లోతో ఆ నీళ్లంతా సెల్లార్‌లోకి వస్తున్నాయని స్థానికులు ఎండీకి వివరించారు. అనంతరం సనత్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ(ఆటోమెటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతి)ని ఎండీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ , మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్-6లో సీవరేజీ సమస్యను పరిశీలించి తెలుసుకుంటున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఆనంద్‌నగర్‌లో ఈడీ పర్యటన

జలమండలి ఓఅండ్‌ఎం డివిజన్-6 పరిధిలోని ఆనంద్‌నగర్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యటించారు. ఆ ప్రాంతంలోని తాగునీటి సరఫరా, నాణ్యత, సప్లయి లెవల్స్, మురుగునీటి నిర్వహణ, తదితర పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఈడీ సూచించారు. ఈడీ వెంట సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, డీజీఎం, మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందజేస్తాం

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 24: హైదరాబాద్‌లోని వివిధ వార్తా సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిస్టులు, స్కానింగ్ ఆపరేటర్లు, లైబ్రేరియన్లు మంగళవారం టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆర్టిస్టులు, స్కానింగ్ ఆపరేటర్లు, లైబ్రేరియన్లకు హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని మీడియా అకాడమీ చైర్మన్‌ను కోరారు. నగరంలోని వివిధ వార్తాపత్రికల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వార్తాపత్రికల ప్రచురణలో వారి పాత్ర ప్రాముఖ్యతను తెలియజేశారు. వర్కింగ్ జర్నలిస్టులతో సమానంగా సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ, టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు కోటిరెడ్డి, హెచ్ యూజే అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. ఆర్టిస్టులు, లైబ్రేరియన్లు, స్కానింగ్ ఆపరేటర్లు అందరూ న్యూస్‌రూమ్‌లలో అంతర్భాగమని, వార్తా పత్రికల తయారీలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్టులుగా ఆర్టిస్టులు, స్కానింగ్ ఆపరేటర్లు, లైబ్రేరియన్లందరికీ అన్ని సంక్షేమ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రవణ్ కుమార్, భాను ప్రసాద్ సింగీతం ఆధ్వర్యంలోని వివిధ శాఖల ఉద్యోగులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు.

భారత్ టీ20 మ్యాచ్ ఏర్పాట్లు షురూ

బందోబస్తు కోసం డీసీపీని కలిసిన హెచ్‌సీఏ ప్రతినిధులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా వచ్చే నెల 12న భారత్, బంగ్లాదేశ్ టీ20 మ్యాచ్ కోసం ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాట్ల కోసం కార్యదర్శి దేవరాజ్, కౌన్సిలర్ సునీల్ కుమార్‌తో కలిసి ఆయన మల్కాజిగిరి డీసీపీ పీవీ పద్మజను కలిశారు. దసరా రోజున మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో బందోబస్త్ ఏర్పాటు చేయాలని డీసీపీని కోరారు. పోలీసుల సహకారంతో ఈ ఏడాది ప్రారంభంలో టెస్టు మ్యాచ్, ఐపీఎల్ మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహించామని, వచ్చే నెలలో టీ20 మ్యాచ్‌ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆదీశ్వర్ ఆటో రైడ్ ఇండియా ఫెస్టివల్ ఆఫర్లు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) : పండుగల సీజన్‌ను పురస్కరించుకుని ఆదీశ్వర్ ఆటోరైడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పాపులర్ బ్రాండ్స్ క్యూజే మోటార్స్, మోటోమోరిని మోడల్స్‌పై బంపర్ ఆఫర్లను ప్రకటించింది. క్యూజే మోటార్స్ క్లాసిక్ ఎస్సార్సీ 250పై రూ.30వేల డిస్కౌంట్ ప్రకటించగా.. ఎస్సార్సీ 500 మోడల్‌పై రూ.40వేల వరకు సేవింగ్ చేసుకోవచ్చని కస్టమర్లకు సూచించింది. ఇటాలియన్ మెర్క్యూ మోటోమినీపై భారీ డిస్కౌంట్ ప్రకటిస్తూ ఫెస్టివల్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24: ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 205 భాగస్వామ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని డియర్‌నెస్ అలవెన్స్(డీఏ)లలో 1-7-2024న జీవో ద్వారా ప్రకటించిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేత రవీందర్ రెడ్డి, చావ రవి, శ్రీపాల్ రెడ్డి, సదానంద్ గౌడ్, మున్సిపల్ జేఏసీ నాయకుడు తిప్పర్తి యాదయ్య, పి.జగన్‌మోహన్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ యూనీడీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నల్లతీగల మధు, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం పాల్గొన్నారు.

సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దు

ఇస్రో చైర్మన్ సోమనాథ్

రవీంద్రభారతి, సెప్టెంబర్ 24 : సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దని, ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలుగు రీజియన్ మలయాళ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూన్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, విద్య, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకుడిగా ఉన్నప్పుడు తాను కార్టూన్లు వేసేవాడినని, తనకు కార్టూనిస్ట్‌లు అన్నా, కార్టూన్‌లో ఉండే చమత్కారం అన్నా ఎంతో ఇష్టమని అన్నారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మ